సాక్షి
రంగారెడ్డి

గురువారం । 17 । ఆగస్టు । 2023



నేడు హరీశ్‌రావు పర్యటన

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో గురువారం రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటించనున్నారు. 8లో▸



ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణకుమారి అన్నారు. 8లో▸



నిర్లక్ష్యం తగదు

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు బుధవారం ధర్నా చేపట్టారు. 8లో▸

న్యూస్‌రీల్

సైబర్ నేరాలతో జాగ్రత్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి పాఠశాలలో బుధవారం షీటీమ్ ఆధ్వర్యంలో కళాజాత బృందం చేత సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడారు. అత్యవసర సమయంలో డయల్ 100, సైబర్ నేరాల గురించి అయితే 1930, బాల్యవివాహాలు, చిన్నపిల్లలపై హింసకు సబంధించి చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, ఈవ్‌టీజింగ్‌కి సంబంధించి సైబరాబాద్ వాట్సప్ నంబర్ 94906 17444లో సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గేమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చిన్నపిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పించారు. చేవెళ్ల షీటీమ్ బృందం సిబ్బంది మల్లేశ్, రవీందర్, రేష్మ, వైద్యనాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, కళాజాత బృందం సభ్యులు.. శ్రీనివాస్, వెంకటేశ్, రాజు, సుదర్శన్, రజిత, చేవెళ్ల సర్కిల్ చైల్డ్ హెల్ప్‌లైన్ ఇన్‌చార్జి సబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

శభాష్.. మంజుల

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు



అవార్డు అందుకుంటున్న మంజుల

మొయినాబాద్‌రూరల్: మట్టి గణపతులు తయారు చేసి గత పదేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలకు అతి తక్కువ రేటుకే అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర క్లే గణేష్ స్టాట్యూస్ మానిఫ్యాక్చర్ సొసైటీ సంస్థ అధ్యక్షురాలు మంజులను రాష్ట్ర గవర్నర్ తమిళిసై ప్రశంసించారు. మంగళవారం రాత్రి రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో క్లే గణేష్ సొసైటీ వారికి గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. 2013 నుంచి నగరంలోని హెచ్‌ఎండీఏ, పలు ప్రభుత్వ సంస్థలకు మార్కెట్ రేట్‌తో పోలిస్తే అతి తక్కువ రేటుకే గణపతి మట్టి విగ్రహాలను అందజేస్తున్నామని తెలిపారు. తమ సేవలను గుర్తించి అవార్డు అందజేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

హుడాకాంప్లెక్స్: ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.వెంకటేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సరూర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు ఆయన పలు సూచనలు చేశారు. 16వ తేదీ నుంచి రెండువారాల పాటు ఇంటింటికి తిరిగి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి క్రమం తప్పకుండా చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డా.అరుణ, జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.గీత, ప్రోగ్రాం ఆఫీసర్ డా.వినోద్, వైద్యాధికారి అర్చన, డీపీఎంఓ సులోచన, ఏపీఎంఓ లక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు రఘు, జ్ఞానేశ్వర్, పబ్లిక్‌హెల్త్ నర్సు సుజాత, ఆరోగ్య విస్తరణ అధికారి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మా ప్లాట్లను కాపాడండి'

ఇబ్రహీంపట్నం రూరల్: తమ ప్లాట్లను ధరణిలో వ్యవసాయ భూములుగా మార్చి కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని శంకర్‌హిల్స్ ప్లాట్ల కొనుగోలుదారులు ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట బుధవారం సుమారు 200 మంది నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ.. గండిపేట్ మండలంలోని వట్టినాగులపల్లిలో 460 ఎకరాల భూమిలో కొన్నేళ్ల క్రితం 3,328 ప్లాట్లు కొనుగోలు చేశామని.. ఇటీవల కొంతమంది రాజకీయ పలుకుబడి ఉన్నవారు మా ప్లాట్లను ధరణిలో వ్యవసాయ భూములుగా నమోదు చేసి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఇలా చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేసి ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు న్యాయం చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ప్లాట్ల కొనుగోలుదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఏవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనకమామిడి సర్వేనం 510లోని ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్



ప్రభుత్వ భూమిలో దుపట్టా

- కనకమామిడి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్
- ముందుగా పక్క భూమిని కొనుగోలు చేసి.. ఆపైన ఆక్రమణకు ప్లాన్
- తమ ఫాంహౌస్‌లో కలుపుకొనేందుకు యత్నం
- ఓ మాజీ మంత్రి నిర్వాకం!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పట్టా భూమి.. ఆ పక్కనే ప్రభుత్వ భూమి.. ఇంకేముంది. నేతల కన్ను సర్కారీ భూములపై పడింది. తలాపాపం.. తిలాపిడికెడు అన్నట్లు... రాజకీయ ప్రముఖులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిసి రూ.కోట్లు విలువచేసే స్థలాలను కొల్లగొట్టారు. వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేసుకున్నారు. అయితే ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు కూడా పరోక్షంగా కబ్జాదారులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మొయినాబాద్ మండలం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 510లో సుమారు 367 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరం రూ.4కోట్లకుపైగా ధర పలుకుతోంది. దీనిలో ఇప్పటికే 87 ఎకరాలు స్థానిక నిరుపేదలకు గత ప్రభుత్వాలు అసైన్డ్ చేశాయి. అయితే మిగిలిన భూములపై పెద్దల కన్ను పడింది. ఎలాగైనా ఈ భూములను హస్తగతం చేసుకోవాలని భావించిన కొందరు రియల్టర్లు, రాజకీయ నేతలు ముందుగా.. ఆ పక్కనే ఉన్న పట్టా, అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. ఆయ భూముల్లో ఫాంహౌస్‌లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదే క్రమంలో వారి భూములకు అటు, ఇటుగా సరిహద్దులోని ప్రభుత్వ భూమికి గుట్టుగా ఫెన్సింగ్ వేస్తున్నారు.

గతంలో కూడా..

గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఈ ప్రాంతంలోనే 10ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి.. దానికి సరిహద్దులో ఉన్న మరో 7ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. దాని చుట్టూ ప్రహరీనిర్మించాడు. ఈ విషయం బయటపడంతో అప్పట్లోనే రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని కూల్చివేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆక్రమణదారుడు తిరిగి నిర్మించారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేసి..

తాజాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి సర్వే నంబర్ 287లో రెండు ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఆ భూమిలో ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. ఆ పక్కనే ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పట్టా భూమిలో కలిపేసుకున్నారు. ఈ విషయం తెలిసి కూడా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. పరోక్షంగా వారికి సహకరిస్తున్నట్లు తెలిసింది. రూ.కోట్లు విలువ చేసే సర్కార్ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కనకమామిడి రెవెన్యూలోని ప్రభుత్వ భూమిని పరిశీలిస్తాం. కబ్జాకు గురైనట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే ఊరుకునేది లేదు. సర్వే అనంతరం కబ్జా చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గౌతం, తహసీల్దార్, మొయినాబాద్

కళ్లలో కారం చల్లి.. కత్తితో పొడిచి..

రాజకీయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడని అంతం

- హోమోసెక్స్ వివాదంలో హతమార్చినట్లు యత్నం
- రౌడీషీటర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సహా నలుగురి అరెస్ట్
- పరారీలో మరో ఇద్దరు నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్

సైదాబాద్/పహాడీషరీఫ్: పాతబస్తీ బండ్లగూడలో కలకలం సృష్టించిన రౌడీషీటర్ హత్య కేసును సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. రాజకీయంగా తమను అప్రతిష్ట పాల్జేస్తున్న రౌడీషీటర్‌ను హత్య చేయాలని కుట్ర పన్నిన జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్.. హతుడికి స్నేహితుడైన మరో రౌడీషీటర్ హోమోసెక్స్ వివాదంలో హత్య చేసినట్లుగా ఉండేలా యత్నించారు. అయితే వారి కుట్రను పోలీసులు బట్టబయలు చేశారు. బుధవారం సైదాబాద్‌లోని తన కార్యాలయంలో డీసీపీ రూపేష్ వివరాలు వెల్లడించారు.

జైలులో ఏర్పడిన పరిచయంతో..

- బార్కాస్‌కు చెందిన షేక్ సయాద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ బవజీర్ (27) చాంద్రాయణగుట్ట పీఎస్ పరిధిలో రౌడీషీటర్. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో 3 పోక్సో కేసులు సహా మొత్తం 9 కేసుల్లో నిందితుడు. బండ్లగూడలో ఆఫీస్ ఏర్పాటు చేసుకొని యూ ట్యూబర్‌గా పని చేస్తున్నాడు. బవజీర్‌కు 2021లో జైలులో ఉన్న సమయంలో భవానీనగర్ పీఎస్ పరిధి రౌడీషీటర్ అయిన వాషింగ్ మెషిన్ మెకానిక్ అహ్మద్ బిన్ హాజీబ్‌తో పరిచయమైంది. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా వారు స్నేహం కొనసాగిస్తున్నారు. వీరిద్దరికీ హోమోసెక్స్‌వల్ అలవాటు ఉంది. అందుకు తన స్నేహితులను తీసుకురమ్మని హాజీబ్‌ను బవజీర్ వేధించేవాడు. దీంతో అతను తన స్నేహితులను తెచ్చేవాడు.

రూ.13 లక్షలకు ఒప్పందం..

ఈ నేపథ్యంలో బవజీర్.. జల్‌పల్లి మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ తరచూ తన యూట్యూబ్‌లో ప్రచారం చేసేవాడు. అతని వీడియోలతో ప్రతిష్ట దెబ్బ తింటోందని, రాజకీయంగా తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాదీ, అహ్మద్ సాదీ, సాలేహ్ సాదీ, ఒమర్ సాదీ భావించారు. హాజీబ్‌కు బంధువైన ఒమర్ సాదీ అతడిని బార్కాస్‌కు తీసుకువెళ్లి మిగిలిన వారిని పరిచయం చేశాడు. బవజీర్‌ను తమపై అనుమానం రాకుండా హతమారిస్తే రూ. 13 లక్షలు ఇచ్చేలా వారి మధ్య ఒప్పందం కుదిరింది.

బాలుడిని తీసుకొచ్చి..

- బవజీర్ హోమోసెక్స్ అలవాటును ఆసరాగా చేసుకొని హత్య చేయాలని హాజీబ్ ప్లాన్ వేశాడు. ఈ నెల 9న గతంలో హోమోసెక్స్‌కు పాల్పడిన బాలుడిని తీసుకు వస్తున్నట్లు బవజీర్‌కు ఫోన్‌లో చెప్పాడు. హాజీబ్ తన స్నేహితుడు మహ్మద్ అయూబ్‌ఖాన్‌ను, బాలుడిని తీసుకొని బవజీర్ ఆఫీస్‌కు వెళ్లాడు. బవజీర్ బాలుడితో కలిసి ఉన్న హాజీబ్ లోనికి వెళ్లి తనతో తెచ్చుకున్న కారం పొడిని బవజీర్ కళ్లలో చల్లి అతడిని కత్తితో పొడిచి హతమార్చి అక్కడి నుంచి వాహనాలపై పారిపోయారు.
- కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు హాజీబ్, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాదీ, అహ్మద్ సాదీ, అయూబ్‌ఖాన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాలేహ్ సాదీ, ఒమర్ సాదీలు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. బవజీర్ తనకు ప్రాణహాని ఉందని బతికి ఉన్న సమయంలోనే పోలీసులకు, హోంమంత్రికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై డీసీపీ మాట్లాడుతూ.. అతని ఫిర్యాదులను కోర్టు అనుమతుల కోసం పంపామని, ఎలాంటి ఫిర్యాదులపై అయినా తాము వెంటనే స్పందిస్తామని ఆయన తెలిపారు.

శరవేగంగా ఓటరు నమోదు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

- కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేస్తున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. రాష్ట్ర జాయింట్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ పోస్టల్‌శాఖ ద్వారా వెంటనే ఇంటికి గుర్తింపు కార్డులు చేరేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిశీలన చేపడుతున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా ఈనెల 19న అన్ని సెగ్మెంట్ల పరిధిలో 5–కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు సహా అందరినీ భాగస్వాములు అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

మాజీ మంత్రి గడ్డం వినోద్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని మాజీ మంత్రులు గడ్డం వినోద్‌కుమార్, గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండల అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన మండలంలోని కనకమామిడి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 24న చేవెళ్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశానికి పెద్దఎత్తున జన సమీకరణ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. దాదాపు లక్షకు పైగా జనసమీకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీసతీష్, పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు దర్శన్, సీనియర్ నాయకులు భీమ్‌భరత్, వసంతం, మండల అధ్యక్షుడు మాణయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కాలి నడకన.. పది కిలోమీటర్లు!

- కుర్మేడ్‌గేట్ వద్ద అదృశ్యం.. మాల్‌లో ప్రత్యక్షం
- పోలీసులు, సోషల్ మీడియా చొరవతో తండ్రి చెంతకు చేరిన నాలుగేళ్ల బాలుడు



యాచారం పీఎస్‌లో బాలుడు రవికుమార్

యాచారం: ఆడుకుంటూ బయటకు వచ్చిన ఓ బాలుడు.. పది కిలోమీటర్ల దూరంలో ప్రత్యక్షమయ్యాడు. పోలీసులు, సోషల్ మీడియా చొరవతో చివరకు తల్లిదండ్రుల వద్దకు చేరాడు. ఇందుకు సంబంధించి సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బీహార్‌కు చెందిన చందన్‌కుమార్ నల్గొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడ్‌గేట్ వద్ద(సాగర్ రోడ్డుకు సమీపంలో) ఓ డెయిరీ ఫాంలో కూలీ పని చేస్తూ కుటుంబంతో ఉంటున్నాడు. ఇతని కొడుకు రవికుమార్ బుధవారం ఉదయం డెయిరీ ఫాం నుంచి బయటకు వచ్చి.. రోడ్డు పక్కన నడుస్తూ మాల్‌కు చేరుకున్నాడు. అప్పటికే మధ్యాహ్నం కావడంతో ఆకలిగొన్న బాలుడు బిక్కుబిక్కుమంటూ మాల్‌లో (నల్లవెల్లి చౌరాస్తా) తిరగడాన్ని గమనించిన స్థానికులు యాచారం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు చిన్నారిని పీఎస్‌కు తరలించారు. బాలుడి ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది వైరల్‌గా మారి.. విషయం బాలుడి తండ్రి చందన్‌కుమార్‌కు చేరింది. దీంతో స్థానికులతో కలిసి యాచారం పీఎస్‌కు వెళ్లాడు. రవికుమార్.. చందన్ కొడుకేనని నిర్ధారించుకున్న అనంతరం బాలుడిని అతనికి ఇచ్చి పంపించారు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల బాలుడు పది కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాడా..? ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కనిపించకుండా పోయినప్పటికీ తల్లిదండ్రులు ఎందుకు పట్టించుకోలేదు..? అనే విషయాలపై స్పష్టత లేకుండాపోయింది. ఈ విషయాలను అడిగేందుకు 'సాక్షి' చందన్‌కుమార్‌కు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

అధికార పార్టీ నేతలకే దళితబంధు



మహిళలతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

- బీఆర్‌ఎస్ సర్కార్‌పై డీసీసీ అధ్యక్షుడు చల్లా ఫైర్

మీర్‌పేట: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి వివరించారు. దళిత బంధు సహాయాన్ని అధికార పార్టీకి చెందిన నేతలకే ఇస్తున్నట్లు ఆయన ఆరోపించారు. అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాబు, నాయకులు బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్థానికులనే ఇవ్వాలి..

మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికేతరులకు ఇస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మన్సాన్‌పల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహేశ్వరం మండలం.. మన్సాన్‌పల్లి, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకు ఎన్ని ఇళ్లు ఇస్తున్నారో మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపులో జాప్యాన్ని నిరసిస్తూ మన్సాన్‌పల్లిలోశుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చల్లా బాల్‌రెడ్డి, చంద్రమోహన్, మాజీ సర్పంచ్ యాదయ్య, యాదయ్య, దశరథ నాయక్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మా'తో ప్రపంచస్థాయి గుర్తింపు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- 979 మంది రైతులకు పట్టా సర్టిఫికెట్లు అప్పగింత
- దసరా రోజున ఇళ్ల స్థలాలు చూపిస్తామని వెల్లడి
- భూదాన్ భూమలను రీసర్వే చేయాలని నేతల వినతి



యాచారం: రైతులకు పట్టా సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిసన్‌రెడ్డి అన్నారు. యాచారం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మాసిటీకి భూములిచ్చిన 979 మంది రైతులకు రెండో విడిత కింద ఎకరాకు 121 గజాల చొప్పున పట్టా సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూములు అప్పగించిన రైతులకు దసరా రోజున మీరాఖాన్‌పేట హెచ్‌ఎండీఏ వెంచర్‌లో స్థలాలు అప్పగిస్తామని తెలిపారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన అసైన్డ్ రైతులకు కూడా పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం పరిహారం ఇప్పించినట్లు తెలిపారు.

భూదాన్ భూమిపై రీ సర్వే..

తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లోని 250 ఎకరాల భూదాన్ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇచ్చిన పరిహారంపై రీసర్వే చేయించాలని ఎంపీపీ కొప్పు సుకన్య, తాడిపర్తి సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యుడు బావయ్య కోరారు. ఆ భూమిని ఏళ్లుగా పేద రైతులు కబ్జాలో ఉండి సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని..అధికారులు మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రూ.కోట్లలో పరిహారం ఇచ్చారని వారు ఆరోపించారు. వారికి ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇవ్వవద్దని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నిజమైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. సంబంధిత భూమిని రీ సర్వేచేసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డిని ఎమ్మెల్యే మంచిరెడ్డి ఆదేశించారు. కాగా ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు మండలాల్లో గురువారం రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, సబితారెడ్డి రూ.65 కోట్ల మేర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం ఎంపీపీ సుకన్య, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వీరన్న కుటుంబానికి 'సాక్షి' చేయూత

ముషీరాబాద్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 'సాక్షి' కవాడిగూడ రిపోర్టర్ మద్దినేని వీరన్న కుటుంబానికి 'సాక్షి' కుటుంబం అండగా నిలిచింది. వీరన్న అకాల మరణంపై స్పందించిన సాక్షి బ్యూరో, డెస్క్ ఉద్యోగులు ఆయన కుటుంబానికి తోడుగా నిలిచారు. వారు అందించిన ఆర్థిక సహాయాన్ని బుధవారం 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో ఎడిటర్ వర్దెల్లి మురళి చేతుల మీదుగా వీరన్న కుమారుడు ధనుష్, సోదరుడు గుట్టయ్యలకు చెక్కు రూపంలో అందజేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా 'సాక్షి' మురళి ధనుష్‌కు సూచించారు. త్వరలో వీరన్న భార్యకు మరో రూ.రెండు లక్షల బీమా మొత్తం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిటీ బ్యూరో ఇన్‌చార్జి డి.వెంకటేశ్వర్‌రెడ్డి, ముషీరాబాద్ జోన్ ఇన్‌చార్జి సీహెచ్.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేడు 'పట్నం'లో హరీశ్‌రావు పర్యటన

నియోజకవర్గ వ్యాప్తంగా రూ.68.21కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్న ఆర్థిక మంత్రి



మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్న ఆర్డీఓ కార్యాలయ భవనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటించనున్నారు. రెండోసారి బీఆర్‌ఎస్ అధికారం చేపట్టాక హరీశ్‌రావుది ఇదే తొలిపర్యటన. ఈ మేరకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి మంత్రి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆయన మంత్రి పి.సబితారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలతో కలిసి సుమారు రూ.68.21కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేస్తారన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం భవన ప్రారంభోత్సవం, రూ.5కోట్లతో లష్కర్‌గూడ వద్ద నిర్మించనున్న వంతెనకు శంకుస్థాపన, తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందించేందుకు తొర్రూర్, కమ్మగూడ గ్రామాల మధ్య రూ.8 కోట్ల నిధులతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవం, ఇంజాపూర్ వద్ద రూ.3.15కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.16కోట్ల నిధులతో తుర్కయంజాల్ నుంచి నాదర్‌గుల్ వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బొంగుళూరు క్రాస్ రోడ్డు వద్దనున్న క్లాం జంగారెడ్డి ఫంక్షన్ హాల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా సంఘాలకు రూ.286 కోట్ల రుణాల చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో బస్తీ దవాఖాన ప్రారంభోత్సవం, రూ.11 కోట్లతో నిర్మించిన ఇబ్రహీంపట్నం ఇబ్రహీంబాషా వద్ద ఇండస్ట్రీస్ పార్కు రోడ్డు ప్రారంభోత్సవం, తట్టిఖానా వద్ద రూ.6కోట్లతో నిర్మించిన రెండు ఎస్టీ గురుకులాల ప్రారంభోత్సవం, రూ.5 కోట్లతో నిర్మించనున్న ఎస్టీ డార్మెంటరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలో డయాలిసిస్ కేంద్రం ప్రారంభోత్సవం, ఇబ్రహీంపట్నంలో రూ.5కోట్ల నిధులతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు పనుల శంకుస్థాపన, క్యాంపు కార్యాలయం వద్ద రూ.2.5కోట్లతో నిర్మించిన ఆర్డీఓ కార్యాలయం భవన ప్రారంభోత్సవం, యాచారం మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో రూ.2 కోట్లతో నిర్మించనున్న అదనపు గదుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో హాజరవ్వాలని రమణారెడ్డి కోరారు.

యువతి అదృశ్యం



పూజ(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆర్ల వెంకటేశ్ ఈ నెల 13న తన తల్లి, సోదరి పూజతో కలిసి తుక్కుగూడ బస్టాప్‌కు వచ్చారు. సోదరిని బస్టాప్‌లో ఉంచి వారు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. 20 నిమిషాల తర్వాత వారు వచ్చి చూడగా యువతి కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు దాటుతుండగా..

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



చమన్‌సింగ్ మృతదేహం

కందుకూరు: అతివేగంతో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు ఓ యువకుడిని బలి తీసుకుంది. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ జిల్లా కాక్రియాకు చెందిన చమన్‌సింగ్(20) కందుకూరు చౌరస్తాలోని బాలాజీ బేకరీలో పని చేసేందుకు వచ్చాడు. మంగళవారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో తనతో పనిచేసే మరో కార్మికుడు శ్యాంసింగ్‌తో కలిసి చౌరస్తాలోని బాల్యానాయక్ హోటల్‌లో భోజనం చేసి బేకరీకి వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో నడుపుతూ యువకుడిని ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు, పోలీసులు 108 అంబులెన్స్‌లో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసట్టారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- దుండగులకు ఆశ్రయం ఇచ్చిన ట్రాన్స్ జెండర్
- రెండు బైక్‌లు, రెండు కత్తులు, మొబైల్‌ఫోన్లు స్వాధీనం

మాదాపూర్: బోరబండకు చెందిన రౌడీ షీటర్ నదీమ్ హత్య కేసులో నిందితులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కేసు వివరాలు వెల్లడించారు. షేక్ అజీజ్ అహ్మద్, షేక్ రిజ్వాన్, ట్రాన్స్ జెండర్ శ్యామల దేవిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. హతుడు నదీమ్ ఫ్లవర్ డెకరేషన్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. అతడిపై బోరబండ పీఎస్‌లో రౌడీ షీట్ ఉంది. షేక్ అజీజ్ అహ్మద్, షేక్ రిజ్వాన్, పాడవు మహేశ్ అదే బస్తీలో ఉండేవారు. నదీమ్ తరచూ వారితో గొడవ పడుతూ వారిపై దాడులకు పాల్పడేవాడు. అతడి వేధింపులు తాళలేక ముగ్గురూ కలిసి నదీమ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం ఆదివారం రాత్రి బర్త్‌డే పార్టీ పేరుతో అతడిని రప్పించారు. మద్యం మత్తులో ఉన్న నదీమ్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం వారు శ్యామల దేవి ఇంట్లో తలదాచుకున్నారు. హత్య విషయం తెలిసినప్పటికి, పోలీసులకు సమాచారం ఇవ్వకపోగా నిందితులకు ఆశ్రయం కల్పించినందుకు ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, రెండు కత్తులు, నాలుగు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు షేక్ అజీజ్ అహ్మద్‌పై జూబ్లీహిల్స్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదైనట్లు తెలిపారు. షేక్ రిజ్వాన్‌పై సనత్‌నగర్, బాలానగర్, మాదాపూర్, జగద్గిరిగుట్ట పీఎస్‌లలో పలు కేసులున్నాయన్నారు. హత్య కేసును చేధించిన మాదాపూర్ పోలీసులను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణకుమారి



అంబేడ్కర్‌కాలనీలో ఇంటింటి సర్వే తీరును పరిశీలిస్తున్న స్వర్ణకుమారి

చేవెళ్ల: ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో బుధవారం లెప్రసీ వ్యాధి నివారణకు చేపట్టిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. లెప్రసీ వ్యాధిపై గ్రామాల్లో ఇంటింటికీ పర్యటిస్తూ వారి శరీరంపై తెల్ల, నల్ల మచ్చలు, స్పర్శలేని మచ్చలను పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నామన్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండల పరిధిలోని ఆలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఈ ఇంటింటి సర్వే చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, సూపర్‌వైజర్ పాలమ్మ, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

మంచాల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంచాల పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. బొమ్మల రామారం గ్రామానికి చెందిన ధరావత్ మాంగ్యా లింగంపల్లిలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని నాలుగు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మాంగ్యాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు మోకిల ఫేజ్- 2 ప్రీ బిడ్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల ప్రాంతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) రూపొందించిన భారీ లేఅవుట్ ప్లాట్లకు గణనీయమైన డిమాండ్ ఉంది. రెండో దశలో హెచ్‌ఎండీఏ 300 ప్లాట్ల విక్రయాలపై గురువారం ఉదయం 11 గంటల నుంచి ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనుంది. మోకిల మొదటి దశలో 50 ప్లాట్ల వేలానికి భారీగా పోటీ నెలకొన్న నేపథ్యంలో హెచ్‌ఎండీఏ రెండో దశలో 300 ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయిస్తోంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, నిర్దేశించిన మేరకు ఈఎండీ చెల్లించి ఈ- వేలంలో పాల్గొనవచ్చు. ఈ నెల 23 నుంచి 29 వరకు ఆన్‌లైన్ వేలం ప్రక్రియ కొనసాగనుంది.

బ్యాడ్మింటన్ ఆడుతుండగా గుండెపోటు

వ్యక్తి మృతి

రామంతాపూర్: బ్యాడ్మింటన్ ఆడుతుండగా గుండెపోటు వచ్చి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రామంతాపూర్ ఆర్టీసీ కాలనీకి చెందిన కీసర కృష్ణారెడ్డి (46) బుధవారం ఉదయం స్థానిక ఎండోమెంట్ ప్లే గ్రౌండ్‌లో తోటి క్రీడాకారులతో బ్యాడ్మింటన్ ఆడుతున్నారు. ఈ క్రమంలో గుండెపోటుతో హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే కృష్ణారెడ్డి మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

ఇద్దరు కుమారులతో తల్లి అదృశ్యం



కుమారులతో సరిత

నాగోలు: ఇద్దరు కుమారులతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మైత్రి నగర్ నివాసి కాంతమ్మ కూతురు సరిత(42)ను సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి మృదుల్(12) రితేష్(12) ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సమస్యల కారణంగా సరిత రెండేళ్లుగా భర్త నుంచి విడిగా ఉంటోంది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోతున్న ఆమె తన కుమారులను తీసుకొని మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లి కాంతమ్మ స్థానికంగా వెతకడంతో పాటు బంధువులను వాకబు చేసినా కుమార్తె, మనవళ్ల ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లి కాంతమ్మ ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని పలు పరిశ్రమల్లో పని కార్మికులకు రహస్యంగా గంజాయి విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం కొత్తూరు పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ శంకర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్, సంజిత్ దండపాత్, శివప్రదాన్ తీగాగాపూర్ శివారులోని కేశ్రీ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తూ క్వాటర్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరు వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న పలువురు కార్మికులకు గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టి వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా ఒడిస్సా రాష్ట్రం నుంచి ఆనంద్ తమకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరిశ్రమల నిర్వాహకులు కార్మికులకు గంజాయి నిర్మూలనపై అవగాహకల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు కె.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలపై నిర్లక్ష్యం తగదు

సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఇబ్రహీంపట్నం రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి.. రెగ్యులరైజ్ చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరితే కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 ఏళ్లుగా వెట్టి చాకిరీ చేయించుకుని నేడు నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా 4,500 మంది ఏఎన్‌ఎంలను తీసివేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి మరిచిపోవడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పూర్తిస్థాయిలో సమ్మెకి దిగుతున్నట్లు ఆమె ప్రకటించారు.


సమ్మెకు ఏఐటీయూసీ, బీఎస్పీ సంఘీభావం

కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సెకండ్ ఏఎన్‌ఎంలు చేపట్టిన ధర్నాకు ఏఐటీయూసీ, బీఎస్పీ పార్టీ సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, జిల్లా కార్యదర్శి దత్తు నాయక్, బీఎస్పీ నాయకులు విజయ్, ఏఎన్‌ఎంలు సువర్ణ, మన్నెమ్మ, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని బలిగొన్న బావి

స్థల యజమాని నిర్లక్ష్యం
- ఫైకప్పు వేయటంలో తాత్సారం
- జెండా తెచ్చుకునేందుకు వెళ్లిన చిన్నారి
- ప్రమాదవశాత్తు అందులో పడి మృత్యువాత





మణికొండ: స్థల యజమాని నిర్లక్ష్యం ఓ బాలుడి ప్రాణాన్ని బలిగొంది. నెల రోజుల క్రితమే అతని స్థలంలో ఉన్న పురాతన చేదుడు బావిలో ఓ కుక్క పడి మృతి చెందింది. బావిని అప్పుడే మూసి వేయాలని, పిల్లలు చూడకుండా వెళితే అందులో పడే ప్రమాదం పొంచి ఉందని చుట్టు పక్కలవారు చెప్పినా యజమాని పెడచెవిన పెట్టాడు. అందరూ ఆందోళన చెందుతున్నట్టుగానే అభం, శుభం తెలియని ఓ బాలుడు మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అందులో పడి అసువులు బాశాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలం వెల్కొండ గ్రామానికి చెందిన బాలరాజ్ భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం నార్సింగికి వచ్చారు. తాపీమేస్త్రీ పనులు చేస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో అతని కుమారుడు బన్నీ (6) మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం కావటం, ఇతర పిల్లల చేతుల్లో జాతీయ జెండాలు కనిపించటంతో తానూ తెచ్చుకుంటానని రూ.10 తీసుకుని మధ్యాహ్నం 3.10 గంటలకు ఇంట్లో నుంచి దుకాణానికి బయలుదేరాడు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కనిపించకుండా ఉన్న బావిలో పడిపోయాడు.

రాత్రి అయినా రాకపోవటంతో..

మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లిన బాలుడు రాత్రి అయినా ఇంటికి రాకపోవటంతో కంగారు పడిన తల్లితండ్రులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో నార్సింగి పోలీసులను ఆశ్రయించడంతో వారు బుధవారం చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలుడు వెళ్లిన మార్గంలో ఉన్న బావిని చూసి అందులో నీటిని తొలగింప చేసి స్థానిక యువకుడు హాజీతో గాలింపు చేపట్టారు. అంతలోనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.